కరెంటు తీగలతో కలవరం



గంగన్ననగర్‌లో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం పరిధిలో పలు చోట్ల కరెంటు తీగలు స్థానికులను కలవరపెడుతున్నాయి. జోగారావునగర్, యల్లబిల్లివారి వీధి, గంగన్ననగర్, కొత్త రెడ్డికంచరపాలెం ప్రాంతాల నుంచి కంచరపాలెం బీఆర్‌టీఎస్ నేతాజీ కూడలికి వెళ్లే రహదారుల్లో విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా మారాయి. ఆయా ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగులుతుండటంతో అగ్నితుంపరలు వెదజల్లుతున్నాయి. స్థానికులతోపాటు అటుగా రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. బలమైన గాలులు వీచే సమయాల్లో ఆందోళనకరంగా ఉంటోందని వాపోతున్నారు. యల్లబిల్లివారి వీధి నుంచి గంగన్ననగర్‌కు వెళ్లే 65బీ/9, 65బీ/9/ఏ, 65బీ/10 విద్యుత్ స్తంభాల వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ సమస్యపై ఏపీఈపీడీసీఎల్ జోన్–2 కార్యాలయంలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కొత్తరెడ్డి కంచరపాలెంలో చెట్ల కొమ్మల్లో కరెంటు తీగలు

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న కె.కె.రాజు, సారిపిల్లి గోవింద్

సీతంపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 25వ వార్డు రాధాకృష్ణుడి మందిరం, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటికీ ఏయే పథకాలు అందాయో తెలియజేసే బ్రోచర్‌ను అందజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్న తపనతో సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ఇపుడు మరో అడుగు ముందుకు వేసి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను నియమించారని, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు నేరుగా అందేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో డైరెక్టర్లు నూకరాజు, రాయుడు శ్రీను, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, కిరణ్‌రాజు, షేక్ బాజ్జీ, 25వ వార్డు నాయకులు భోగవిల్లి గోవింద్, సానబోయిన సురేష్, సారిపిల్లి సంతోష్, పోతుబంతి హరికృష్ణ, లక్ష్మణ్‌కుమార్, మువ్వల రాజా, సారిపిల్లి గంగరాజు, నమ్మి వెంకట్, బోర గోవింద్, కె.వేణుగోపాల్, సమ్మెట్ల వెంకటేష్, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గృహాల సందర్శన తప్పనిసరి

మహారాణిపేట: ప్రతి ఆశా కార్యకర్త తమ పరిధిలో ఉన్న గృహాలను తప్పనిసరిగా సందర్శించి, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. రేసవాని పాలెంలోని డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆశా కార్యకర్తలకు 6, 7 మాడ్యూల్స్‌పై శిక్షణ ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా, శిశు మరణాలు సంభవించకుండా ఆశా కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రజా రవాణా మేలు

దాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి మేయర్ గొలగాని హరివెంకట కుమారి తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం స్పందనతో పాటు ఇతర కార్యక్రమాలు నిర్వహించి, తిరిగి బస్సులో క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణలో భాగంగా వారంలో ఒక్క రోజు ప్రతి ఒక్కరూ ప్రజా రవాణాను ఉపయోగించాలని కోరారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు



దాబాగార్డెన్స్: కనక మహాలక్ష్మి అమ్మ వారికి మంగళవారం ఉదయం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అప్రెంటిస్‌షిప్‌తో విద్యార్థుల్లో నైపుణ్యం



మాట్లాడుతున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు

మద్దిలపాలెం: విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్ ఎంతో దోహదపడతాయని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్‌పై 12ల కళాశాలల అధ్యాపకులకు లెర్నింగ్ మేనేజ్‌మెంట్ విధానంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ వరకూ ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. అనంతరం ఆయా కళాశాలల విద్యార్థులు నైపుణ్యం సాధించేలా శిక్షణ పొందిన అధ్యాపకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్ పి.వాణి, అప్రెంటిస్‌షిప్ కో–ఆర్డినేటర్లు రాజశేఖర్, మాస్టర్ ట్రైనర్లు జి.శ్రీనివాసరావు, సిహెచ్.లలిత, కె.రవిబాబు పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించి పనులు



నక్కవానిపాలెం శివాలయం పక్క రోడ్డులో అడ్డంగా వేసిన భవన నిర్మాణ సామగ్రి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం శివాలయం పక్క రోడ్డులో చేపడుతున్న భవన నిర్మాణ పనులతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డును ఆక్రమించి ఇసుక, పిక్క అడ్డంగా వేయడంతో రాకపోకలకు తంటాలు పడుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం



జోన్–2 కార్యాలయంలో మాట్లాడుతున్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ



గౌరీ డిగ్రీ కళాశాల సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, వినియోగదారులు

- 1912కు ఫోన్ చేయండి
- సీజీఆర్‌ఎఫ్ చైర్మన్, జోన్–2 ఈఈ

కంచరపాలెం: ఏపీఈపీడీసీఎల్ జోన్–2 డివిజన్ పరిధిలో సోమవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట కార్యాలయం, ఊర్వశి జంక్షన్‌లోని గౌరీ డిగ్రీ కళాశాలల్లో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం(సీజీఆర్‌ఎఫ్) చైర్మన్, రిటైర్డ్ న్యాయమూర్తి బి.సత్యనారాయణ, సంస్థ జోన్–2 ఈఈ బి.కోటేశ్వరనాయుడు మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, హెచ్చు తగ్గులు, బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, బిల్లులో పేరు మార్పిడి, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు, నియంత్రికల మార్పిడి తదితర సమస్యలు, సందేహాలను నివృత్తి చేశారు. విద్యుత్ సమస్యలు, సరఫరాలో అంతరాయాలపై 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. అనంతరం సబ్ డివిజన్‌లో ఏఈ, డిప్యూటీ ఈఈ, ఈఈలతో సత్యనారాయణ, కోటేశ్వరనాయుడు సమావేశం నిర్వహించారు. సదస్సులో అందిన విద్యుత్ ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులకు వారు ఆదేశించారు. సమావేశంలో ఫోరం మెంబర్ హరిబాబు, ఇతర అధికారులు, గౌరీ కళాశాల విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

విశ్రాంత పోలీస్ అధికారుల కార్యవర్గం



కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న విశ్రాంత పోలీస్ అధికారులు

బీచ్ రోడ్డు: విశ్రాంత పోలీస్ అధికారుల అసోసియేషన్ విశాఖపట్నం రేంజ్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగింది. అధ్యక్షుడిగా మాజీ ఐపీఎస్ లక్ష్మణ్ మోహన్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా కె.రామకృష్ణ, కార్యదర్శిగా ఎన్.ఎస్.ప్రసాద్ ఎన్నికయ్యారు.

పోటీ పరీక్షార్థులకు పుస్తకాల పంపిణీ

మహారాణిపేట: ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా చదువుతున్న అభ్యర్థులకు షైన్ ఇండియా మ్యాగజైన్ ఎంతో ఉపయోగపడుతుందని గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ కర్రి రాజేష్ అన్నారు. టౌన్ హాల్ ప్రాంతంలో, లైబ్రరీ సమీపంలో సుమారు 150మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఫిబ్రవరి నెలకు సంబంధించిన మ్యాగజైన్‌ను సోమవారం ఆయన పంపిణీ చేశారు. నిరుద్యోగుల కోసం గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ప్రధాన కార్యదర్శి అనిమిరెడ్డి రమణ ఈ పుస్తకాలను ప్రచురించినట్లు తెలిపారు. రాజేష్, రమణలకు పరీక్షార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగు సినీ ఉత్సవం ప్రారంభం



కె.విశ్వనాథ్, జమున చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సినీ దర్శకుడు వి.ఎన్.ఆదిత్య

సీతంపేట: తెలుగు సినిమా ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. తెలుగు తొలి టాకీ సినిమా భక్తప్రహ్లాద 1932 ఫిబ్రవరి 6న విడుదలై 91 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ మూడు రోజుల పాటు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తోంది. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం సాయంత్రం సినీ దర్శకుడు వి.ఎన్.ఆదిత్య జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ముందుగా సినీ దిగ్గజాలు కె.విశ్వనాథ్, జమున చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ మానవ విలువలను సృశించే సినిమాలను ప్రజలకు చేరువ కావాలని ఫిల్మ్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విశాఖలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, సినీ ప్రేక్షకులు ఒక కమిటీగా ఏర్పడి పాలకులపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. తాను ఇక్కడే చదివానని, విశాఖపై పూర్తి అవగాహన ఉందని, అందుకే తన చిత్రాలు ఎక్కువగా ఇక్కడే షూటింగ్ చేశానని, భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తానని తెలిపారు. అనంతరం కళాతపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వంలో జమున నటించిన ఉండమ్మా బొట్టు పెడతా చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, భరణికాన రామారావు, ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, కాశీవిశ్వేశ్వరరావు, సుసర్ల శ్రీనివాస్, బి.చిన్నారావు పాల్గొన్నారు.

ఫిల్మ్ మేకింగ్‌పై వర్క్‌షాప్ నేడు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఫిల్మ్ మేకింగ్‌పై ఉచిత వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ చిత్ర దర్శకుడు, నిర్మాత, రచయిత వి.ఎన్.ఆదిత్య పాల్గొని ఫిల్మ్ మేకింగ్‌పై శిక్షణ ఇస్తారని తెలిపారు. 18 ఏళ్ల వయసు దాటిన ఔత్సాహిక యువతీ యువకులు, విద్యార్థులు వర్క్‌షాప్‌లో పాల్గొనవచ్చని చెప్పారు. వివరాలకు 90324 77463 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

45వ వార్డులో అభివృద్ధి పనుల పరిశీలన



తారకరామానగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు పరిశీలించారు. తాటిచెట్లపాలెం జాతీయ రహదారి వద్ద గల పెట్రోల్ బంక్ పక్కన జరుగుతున్న కల్వర్టు రిటైనింగ్ వాల్ పనులను ఆయన పరిశీలించగా.. అవి తుదిదశకు చేరుకున్నట్లు జీవీఎంసీ సిబ్బంది తెలిపారు. అనంతరం ఇటీవల తారకరామానగర్‌లో ప్రారంభించిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పూర్తి చేయించాలని సచివాలయ సిబ్బందికి, వర్క్స్ ఇన్‌స్పెక్టర్‌కు హనోకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, పార్టీ నాయకులు హరిపట్నాయక్, సన్యాసప్పలనాయుడు, నేపాల్ శ్రీను, దుర్గేష్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

‘స్పందన’ అర్జీల పరిష్కారానికి చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్



వినతులు పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 25 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్లి శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

జోన్–5కు నాలుగు..

కంచరపాలెం: జ్ఞానాపురం జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పలు సమస్యలు పరిష్కారం కోసం నాలుగు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ నేరుగా వినతులు స్వీకరించారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి– 03, పబ్లిక్‌హెల్త్ విభాగానికి 01 వినతులు అందినట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్లు టీఎస్ఎస్ రాజు, ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వో బూబురావు, ఈఈ టి.ప్రసన్నరెడ్డి, వాటర్ డీఈ శ్రీనివాసవర్మ, టౌన్‌ప్లానింగ్ టీపీవో ఎం.శ్రీలక్ష్మి, అపరంజిత, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వర్సిటీకి విద్యార్థులే గర్వకారణం



ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: భారత ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ముగ్గురు జాతీయ సేవా పథకం వలంటీర్లను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. వర్సిటీకి చెందిన జె.వాసు, వి.ఎస్.ఎస్.లక్ష్మణ్, పి.రమ్య గత నెల 1 నుంచి 25వ తేదీ వరకు ఢిల్లీలో శిక్షణ పొంది 26న నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. వీరితో పాటు రాష్ట్రపతి అవార్డు సాధించిన ధనియాల సాయిని కూడా ఆయన అభినందించారు. గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు పెరేడ్ విశేషాలు, ఢిల్లీలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాన మంత్రి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రిని కలిసిన సందర్భాలను వివరించారు. విశ్వవిద్యాలయానికి గర్వకారణంగా విద్యార్థులు నిలుస్తున్నారని వీసీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, ఐటీఐ సమన్వయకర్త డాక్టర్ పి.రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞ యాగాలతో ప్రపంచ శాంతి

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

ఎంవీపీ కాలనీ: యజ్ఞాలు, యాగాలు, క్రతువులు ప్రపంచ శాంతికి వారధుల లాంటివని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని ఏబీసీ పార్కులో నిర్వహిస్తున్న శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీసౌందర్య లహరి ప్రవచన మహోత్సవాల్లో భాగంగా ఆయన 108 మంది దంపతులతో సామూహిక శ్రీరామదేవుని వ్రతం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతిని నెలకొల్పే యజ్ఞాలు భారతీయ సనాతన సంస్కృతిలో భాగమన్నారు. సమాజానికి మంచి చేసే ఆ సంస్కృతిని ప్రతిఒక్కరూ ఆచరించాలని సూచించారు. వేదాల విజ్ఞానం ఆధునిక సమాజానికి సైతం మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కేవీఎస్ శ్యామ్, అరుణగాయత్రి దంపతుల నేతృత్వంలో నిర్వాహకులు వీవీ ఆదినారాయణ, దొంతకుర్తి శ్రీనివాస్ ఈ వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 108 మంది దంపతులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్తులను కాపాడుకుందాం



ఆర్పీ పేట హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ అధికారులు

కంచరపాలెం: రైల్వే ఆస్తులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని రైల్వే భద్రతా దళ(ఆర్పీఎఫ్) అధికారులు పిలుపునిచ్చారు. రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 56వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ నేతృత్వంలో సోమవారం ఆర్పీఎఫ్ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుపై ఆకతాయిలు చేస్తున్న ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఆర్పీఎఫ్ సీఐ పి.మోహన్‌రావు, ఎస్ఐ రాజు రంజన్ మాట్లాడుతూ వందే భారత్ రైలుపై ఆకతాయిలు రాళ్లు వేయడం దుశ్చర్య అన్నారు. నడుస్తున్న రైళ్లపై రాళ్లు విసరడం వల్ల అవి ప్రయాణికులకు తగిలి గాయాలపాలయ్యే అవకాశముందని, ఇటువంటి పనులు మానుకోవాలని కోరారు. రైల్వే ఆస్తులకు నష్టం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు రైల్వే ట్రాక్‌లపై సెల్ఫీలు వంటి ప్రమాదకరమైన పనులు, నిషిద్ధ ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లు దాటడం వంటి పనులు చేయకూడదని అవగాహన కల్పించారు.

ఆకతాయిలకు దూరంగా ఉండండి..

కంచరపాలెం లా అండ్ ఆర్డర్ ఎస్ఐ దివ్యభారతి మాట్లాడుతూ కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో ఆగతాయిల ఆగడాలు శృతిమించుతున్నాయని, పాఠశాలల్లో విద్యార్థులు జాగ్రత్తగా నడుచుకోవాలన్నారు. కంచరపాలెం పరిధిలో వందే భారత్ రైలుపై ఆకతాయిలు రాళ్లు విసిరిన ఘటన జరగడం మచ్చగా మిగిలిందన్నారు. బాలికలు ఆకతాయిలతో చెడు సావాసం చేయొద్దని సూచించారు. చిన్నారులపై లైంగిక వేధింపులు, దూషణలు సరికాదని, వారితో స్నేహంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.రమేష్‌గౌరీ, సోషల్ వర్కర్ కె.వెంకటేశ్వరరావు, సీఆర్పీ ఎల్.చైతన్య, ఉపాధ్యాయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

శిల్పారామానికి సరికొత్త సొబగులు

కళాకృతులకు జోరుగా పెయింటింగ్ పనులు



ఆధునిక విజ్ఞానం తెలియజేసే కళాకృతి



ఆకట్టుకుంటున్న పక్షుల గూడు



తలపై పుస్తకాలతో బాలిక

పీఎం పాలెం: శిల్పారామంలో కొలువుతీరిన వివిధ కళాకృతులకు, జీవకళ ఉట్టిపడే శిల్పాలకు పెయింటింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఏళ్ల తరబడి పెయింటింగ్‌కు నోచుకోక మసిబారిన కళాకృతులను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది నూతనంగా ఆవిష్కరింపజేయడానికి రాష్ట్ర పర్యాటక శాఖ సంకల్పించింది. ఈ క్రమంలో సుమారు 27 ఎకరాల్లో విస్తరించిన శిల్పారామంలో సహజత్వం, జీవకళ ఉట్టిపడేలా దర్శనమిచ్చే శిల్పాలకు రంగులు వేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని కళాకృతులకు పెయింటింగ్ పనులు, గోపురాల మరమ్మతులు పూర్తయ్యాయని స్థానిక పరిపాలనాధికారి విశ్వనాథ రెడ్డి తెలిపారు. గతంలో చేపట్టిన అన్ని నిర్మాణాలకు మరమ్మతులు చేయించడంతోపాటు కళాకృతులకు పెయింటింగ్ వేయిస్తామని ఆయన తెలిపారు.

రోడ్డుపై రైతుల వ్యాపారాలు



సీతమ్మధార రైతుబజారు వెలుపల కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో ఆర్గానిక్ కంటైనర్‌తో పాటు మరో కంటైనర్ ఏర్పాటు చేయడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. కూరగాయలు అమ్ముకునేందుకు చోటు లేక బజారు బయటకు వచ్చి విక్రయించుకునే పరిస్థితి నెలకొంది. బజారులో నడిచే మార్గం చిన్నది కావడంతో ఇటు రైతులు.. అటు వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. రైతుబజారులో 302 మంది రైతులు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వ్యాపారం చేస్తుంటారు. ఉదయం 120 మంది, సాయంత్రం 70 మంది కూరగాయలు విక్రయిస్తుంటారు. బజారులో కంటైనర్ ఏర్పాటుతో కొందరు రైతులు రోడ్డుపైకి వచ్చి కూరగాయలు విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.